క్లుప్తంగా

నేడు ఒంగోలులోని రైతు బజార్లకు టమోటాలు

ఒంగోలు సబర్బన్: నగరంలోని రైతు బజార్లకు గురువారం టమోటాలు రానున్నాయి. ఓపెన్ మార్కెట్‌లో టమోటా ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. కిలో రూ.50 చొప్పున రైతు బజార్ల ద్వారా ప్రజలకు అందించే కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా ఒంగోలు నగరంలోని కొత్తపట్నం బస్టాండ్, లాయర్‌పేట, దిబ్బలరోడ్డులోని రైతు బజార్లకు నేడు టమోటాలు రానున్నట్లు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ ఉపేంద్రకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళ జీవనోపాధికి తోపుడు బండి అందజేత

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలేనికి చెందిన పేద మహిళ జీవనోపాధికి పండ్లు అమ్ముకునేందుకు సూర్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం తోపుడు బండి అందించారు. ట్రస్టు సభ్యులు సర్దార్‌బాషా, మారెళ్ల సుబ్బారావు, మొగిలి దేవ, బుచ్చేశ్వరరావు, సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

856 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం-2లో బుధవారం నిర్వహించిన వేలానికి మొత్తం 925 బేళ్లు రాగా, 856 బేళ్లను కొనుగోలు చేశారు. కేజీ గరిష్ట ధర రూ.270 పలకగా, కనిష్ట ధర రూ.160 పలికింది. సరాసరి ధర రూ.253.63 పలకగా, 9 బేళ్లు నోబిడ్ అయ్యాయని వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

10న కలెక్టరేట్ ముట్టడి

ఒంగోలు: సర్పంచుల నిధుల దుర్వినియోగంపై రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశానుసారం ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు పులి వెంకట కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలి



వలంటీర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ దంపతులు

నాగులుప్పలపాడు: వలంటీర్లు బాధ్యతగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన వలంటీర్లకు బుధవారం ఎంపీపీ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన వీవీ ప్యాట్ల పనితీరు పరిశీలన



కొత్తగా వచ్చిన వీవీ ప్యాట్ల పనితీరును పరిశీలిస్తున్న నాయకులు

ఒంగోలు అర్బన్: ఇటీవల బెంగళూరు నుంచి స్థానిక ఈవీఎం గోడౌన్‌కు నూతనంగా వచ్చిన వీవీ ప్యాట్లను బెల్ కంపెనీ ఇంజినీర్లు పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లకు వీవీ ప్యాట్లను అనుసంధానం చేసి పనితీరును తనిఖీ చేశారు. ఎలక్షన్ సెల్ ఇన్‌చార్జ్ రాజ్యలక్ష్మి, రాజకీయ పార్టీల ప్రతినిధులు వైఎస్సార్ సీపీ నుంచి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల నుంచి రాజశేఖర్, ఎస్‌కే రసూల్, ఎస్.కిషోర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ గొప్ప వరం

- గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



చీమకుర్తిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న గొప్ప వరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. బుధవారం రాష్ట్రం మొత్తం మీద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించిన సందర్భంగా జిల్లాలో ఐసీడీఎస్ సిబ్బంది చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ చిన్నపిల్లలు, చిన్న పిల్లల తల్లులు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషణను లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలో ప్రతి నెలా 2 కిలోల రాగిపిండి, 3 కిలోల బియ్యం, అరకిలో బెల్లం, అరకిలో చిక్కీ, అరకిలో డ్రైఫ్రూట్స్, కేజీ కందిపప్పు, అరకిలో నూనె, 2.5 లీటర్ల పాలు, నెలలో మొదటి విడత కింద 12 కోడిగుడ్లతో పాటు అటుకులు, కర్జూరాలు ఉంటాయని తెలిపారు. అయా కిట్లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా అధికారిణి పీఆర్ ఆవాంజిలిన్, చీమకుర్తి మున్సిపల్ కౌన్సిలర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: స్థానిక సచివాలయం-1లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని 69 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు 384 మంది, బాలింతలు 328 మందికి కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తపట్నంలో కిట్లు పంపిణీ చేస్తున్న రవీంద్రరెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్లో గర్భిణులు, బాలింతలకు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతుల మీదుగా టేక్ హోమ్ రేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకూ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు తల్లిపాల విశిష్టత గురించి అవగాహన కల్పించారు. డీఈఓ సుభాషిణి, జీఎం ఎస్‌కే కరిష్మ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇనమనమెళ్లూరులో కిట్లు అందిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

పౌరాణిక రంగస్థల నటుడికి నివాళి



రఘు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న కళాకారులు

ఒంగోలు మెట్రో: ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు కరవది రఘు అకాల మరణం దురదృష్టకరమని పలువురు కళాకారులు నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా పౌరాణిక రంగస్థల కళాకారుల ఐక్య వేదిక, జిల్లా రంగ భూమి కళాకారుల ఐక్యవేదిక, జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ఒంగోలు వారి సంయుక్త ఆధ్వర్యంలో రఘు అకాల మృతికి సంతాప సూచికంగా బుధవారం సాయంత్రం ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలోని జిల్లా రంగభూమి కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఐక్యవేదిక అధ్యక్షుడు వాకా సంజీవరెడ్డి, సభ్యులు, జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ సుబ్బయ్య, హార్మోనిస్టు కనుమూరు మస్తాన్‌సాహెబ్, మేకప్ ఆర్టిస్ట్ నారాయణ తదితరులు పాల్గొని కరవది రఘు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన నాటక ప్రస్థానాన్ని, కళారంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రఘు కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

నగరంలో 57,404 విజ్ఞప్తుల పరిష్కారం

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో 57,404 విజ్ఞప్తులను పరిష్కరించామని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు వెల్లడించారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగనన్న సురక్ష పథకానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. నగరంలో 93 శాతం ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఏదో ఒక సంక్షేమ పథకం అందుతూ లబ్ధిపొందుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని మొత్తం 70 వార్డు సచివాలయాల పరిధిలో 1,334 మంది వలంటీర్లు, సచివాలయ సిబ్బంది జగనన్న సురక్ష సర్వే చేపట్టారన్నారు. 84,733 గృహాలు ఉండగా, 74,144 గృహాలను (87.50 శాతం) సర్వే చేసి 58,226 విజ్ఞప్తులు రాగా, వాటిలో 57,404 విజ్ఞప్తులను పరిష్కరించామని వివరించారు. వీటిలో అధికంగా ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 29,493, ఆదాయ సర్టిఫికెట్లు 25,951 ఇచ్చామన్నారు. ఆధార్ కార్డుకు మొబైల్ నంబరు జత చేయటానికి 900, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు 53, కొత్త రైస్ కార్డు, రైస్ కార్డులో సభ్యులను చేర్చడానికి 284, రైస్ కార్డు స్ప్లిట్‌కి 39, సీసీఆర్‌సీకి సంబంధించి 14 అర్జీలను పరిష్కరించామని వివరించారు. సంక్షేమ పథకాల కోసం మరో 5,904 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని ఆగస్టు 15వ తేదీలోగా పరిశీలించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి ప్రయోజనం చేకూరే విధంగా చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు.

పొగాకు ఉత్పత్తి పరిమాణం పెంచాలి

- కేంద్ర వాణిజ్యశాఖ అదనపు కార్యదర్శిని కోరిన ఎంపీ మాగుంట



కేంద్ర వాణిజ్యశాఖ అదనపు కార్యదర్శి రాకేశ్ అగర్వాల్‌కు విజ్ఞప్తి చేస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు: రాష్ట్రంలో వర్జీనియా పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని 170 మిలియన్ కేజీలకు పెంచాలని కేంద్ర వాణిజ్యశాఖ అదనపు కార్యదర్శి రాకేశ్ అగర్వాల్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. గత వారంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పొగాకు రైతు ప్రతినిధులు తనను ఒంగోలులో కలిసి 2023–24 పంట సీజనుకు వర్జీనియా పొగాకు ఉత్పత్తి పరిమాణం గతేడాది మాదిరిగానే 142 మిలియన్ కేజీలుగా జూలై 17న పొగాకు బోర్డు తీర్మానించిన విషయాన్ని తీసుకొచ్చారన్నారు. పొగాకు ఉత్పత్తి వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని, దాని గిరాకీ ఎక్కువగానే ఉందని అన్నారు. వారి వ్యతిరేకతను బోర్డుకు తెలియజేయడం జరిగిందని, అందువలన పరిమాణాన్ని 170 మిలియన్ కేజీలకు పెంచాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పండే వర్జీనియా పొగాకుకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గిరాకీ ఉందన్నారు. ఇప్పటికీ పొగాకు అవసరం, ఎగుమతుల డిమాండ్ ఎక్కువగానే ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. ఉత్పత్తి పరిమాణాన్ని పెంచితే పొగాకు రైతులకు మంచి లాభదాయకమే కాకుండా ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఈ విషయంపై కలుగజేసుకుని బోర్డు వారిని సంప్రదించి పొగాకు పరిమాణం పెంపునకు అవకాశం కల్పించాలన్నారు. కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని పేర్కొనడం ఆనందంగా ఉందని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

ఒంగోలు సబర్బన్: విద్యుత్ ఉద్యోగులు కోర్కెల సాధన కోసం బుధవారం ఒంగోలు నగరంలోని విద్యుత్ భవన్ ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ కమిటీ పిలుపుమేరకు తొలుత ర్యాలీ నిర్వహించి రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. విద్యుత్ ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్టీకాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని 18వ డివిజన్ చెరువుకొమ్ముపాలెంలోని ధూల్‌పేట్ ఎస్టీకాలనీలో నగర మేయర్ గంగాడ సుజాత బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీలో నీటి సమస్య ఉండటంతో బోరు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఇప్పటికే కాలనీలో రూ.25 లక్షలతో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టామని మేయర్ వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుధాకర్‌బాబు, కాంట్రాక్టర్ గోపి, డీఈ పద్మజ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

చీమకుర్తి: మారం వెంకారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం చీమకుర్తి గాంధీనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి చేతుల మీదుగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. తన తండ్రి మారం చిన పేరిరెడ్డి వర్ధంతి సందర్భంగా 800 నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. తాళ్లూరు మండలం గుంటిగంగమ్మ సన్నిధిలో మారం వెంకారెడ్డి ఆర్థిక సహకారంతో నిర్మించిన రూములోకి రూ.30 వేల విలువ చేసే ఫర్నిచర్ అందించారు. తొలుత చీమకుర్తిలోని వెంకారెడ్డి నివాసం వద్ద చిన్న పేరిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

27న వడ్డెర సంఘ బహిరంగ సభ



మాట్లాడుతున్న వడ్డెర సంఘ జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు

ఒంగోలు: నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లాస్థాయి వడ్డెర సంఘ బహిరంగ సభ ఈనెల 27న నిర్వహించాలని తీర్మానించారు. బుధవారం స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో వడ్డెర సంఘ ప్రతినిధులు నిర్వహించిన సమావేశానికి జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభ నిర్వహణ ఎలా అనే దానిపై చర్చించారు. అజెండా అంశాలపైనా చర్చించారు. వడ్డెరల సంక్షేమం, అభివృద్ధి ప్రధాన అంశంగా చర్చించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించి ఈ నెల 27న వడ్డెర భారీ బహిరంగ సభ నిర్వహిద్దామన్నారు. అదే విధంగా వివిధ స్థాయిల్లో పదవులు పొంది బాధ్యతలు నిర్వహిస్తున్న వడ్డెర ప్రతినిధులను సత్కరించుకునే అంశంపై మాట్లాడుకున్నారు. సమీక్షలో జిల్లా అధ్యక్షుడు తన్నీరు శివప్రసాద్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, కన్వీనర్ తన్నీరు నాగేశ్వరరావు, కో కన్వీనర్లు వల్లెపు మురళి, బెల్లంకొండ అశోక్, తన్నీరు వెంకట్రావు, తన్నీరు శ్రీను, తన్నీరు రాము, తన్నీరు సుబ్బారావు, గుంజి కోటేశ్వరరావు, కుంచాల శ్రీను, బి.వెంకటేశ్వర్లు, బండారు రామకృష్ణలను నిర్వహణ కమిటీగా ప్రకటించారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

నాగులుప్పలపాడు: ఉపాధి పనులు చేయించే ఎఫ్ఏలు, టీఏలు వారి పనులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో జయమణి, ఏపీవో రవి, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి హేయం



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి, నాయకులు

నాగులుప్పలపాడు: సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లపై టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరచడం హేయమైన చర్య అని నాగులుప్పలపాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. దాడిని ఖండిస్తూ స్థానిక ఎంపీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను వివరించడానికి ఏర్పాటు చేసిన గడప గడపకు కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండాల్లా వ్యవహరించి మోటారు సైకిళ్ల రోడ్డుకు అడ్డంగా పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లపై దాడి చేసి చొక్కాలు చించడం చాలా బాధాకరమన్నారు. లిడ్‌క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే టీజేఆర్ దళిత ఎమ్మెల్యే అనే చులకన భావంతో లోకేష్ డైరెక్షన్‌లో టీడీపీ నాయకులు ఇలాంటి ఘటనలకు బరితెగిస్తున్నారని, భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోలినేని కోటేశ్వరరావు, ఇస్తర్ల అంజయ్య, చెరుకూరి రమేష్, సర్పంచ్‌లు ఘట్టమనేని అశోక్, బత్తుల కొండయ్య, చిన్నం సురేష్, ఎంపీటీసీ పాద పవన్, కాట్రగడ్డ శ్రీనివాసరావు, హరిబాబు, మద్దిసాని నాగేశ్వరరావు, తోకల శ్రీను, బాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

ఒంగోలు: స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రిజిష్టర్లు పరిశీలించారు. చిక్కీలు, స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. హెచ్‌ఎంతో మాట్లాడి డ్రాపవుట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. సీఆర్‌పీలు తక్షణమే డ్రాపవుట్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి రెగ్యులర్‌గా పిల్లలు పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతుల వారీగా విద్యార్థుల హాజరును పరిశీలించారు. మంచినీటికి ఇబ్బందిగా ఉందని చిన్నారులు తెలియజేయడంతో ఆర్‌వో ప్లాంటు నిర్వహణకు తగు సూచనలు చేశారు. పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఉండాలని, తరగతి గదులు, బాత్‌రూములు మరింత శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వారంరోజుల్లో పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హెచ్‌ఎంకు స్పష్టం చేశారు. ఆమె వెంట డీఎల్‌పీవో దినేష్‌కుమార్, ఎంఈవో-2 సరస్వతి, హెచ్‌ఎం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ ట్యాంకు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మీనా వెంకట్రావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంకు ఆధునీకీకరణ పనులను బుధవారం ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ శింగరాజు మీనా వెంకట్రావు పరిశీలించారు. రూ.1.60 కోట్లతో జరుగుతున్న పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎస్ఎస్ ట్యాంకు చుట్టూ రెండున్నర కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్ విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. ట్యాంకు చుట్టూ కొబ్బరిచెట్ల ఏర్పాటు పనులు కూడా జరుగుతున్నాయన్నారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎస్ఎస్ ట్యాంకు పనులు ఎలా జరుగుతున్నాయని ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారన్నారు. నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. చెరువు కింది ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పార్కు, జిమ్ పనులు కూడా వేగవంతంగా జరగాలన్నారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మీనా వెంకట్రావు సమావేశమయ్యారు. వారి సూచనలను కూడా పరిగణలోకి తీసుకుని అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

విద్యార్థులంతా పరీక్షలకు హాజరుకావాలి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న రమేష్

కొత్తపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి అసెస్మెంట్ పరీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎం.రమేష్ సూచించారు. మండలంలోని పలు పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లూరులోని ప్రాథమిక పాఠశాల, కొప్పోలు ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అల్లూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఒంగోలు కమ్మపాలెం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. నాణ్యమైన మెటీరియల్ ఉపయోగించాలని కోరారు. సీతా పాఠశాలలో ఆర్వో ప్లాంట్ పనితీరుపై ఆరా తీశారు. అన్ని పాఠశాలల్లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అసెస్మెంట్ పరీక్షలకు తప్పనిసరగా హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా విద్యార్థులు వెనుకబడి ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని తెలిపారు.